

బడిబాట ర్యాలీలో సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

అంబర్‌పేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం శుక్రవారం అంబర్‌పేటలో నిర్వహించారు. అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీలమ్మ, పోలీస్ బాయిస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అంబర్‌పేటలో పలు ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వల్ల విద్యార్థులకు ఉత్తమ విద్య లభిస్తుందని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తారని తెలిపారు. పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి బడిబాట గురించి వివరించారు.

'వర్షాకాలంలో డ్రైనేజీ మూతలు తెరవొద్దు'

చిక్కడపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రోడ్లపై డ్రైనేజీ మూతలు తెరవొద్దని వాటర్‌బోర్డు అశోక్‌నగర్ మేనేజర్ కృష్ణమోహన్ సూచించారు. మ్యాన్‌హోల్స్ నిర్వహణలో 'మనుషులను నివారిద్దాం యంత్రాలతో పనిచేయిద్దామని' పిలుపునిచ్చారు. మ్యాన్‌హోల్స్ మూతలు తెరిచి ఉంటే వెంటనే జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

అశోక్‌నగర్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

చిక్కడపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్‌లో గురువారం చెట్టు కూలి ఫీడర్ వైర్లు తెగిపోవడంతో నిలిచిపోయిన విద్యుత్‌సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. వంగిపోయిన విద్యుత్ స్తంభాలకు శుక్రవారం తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. పెవిలియన్ ఇన్‌ఫ్రా సంస్థ నిర్మిస్తున్న భవనం సెల్లార్‌లో ఉన్న చెట్టు పడిపోవడానికి సిద్ధంగా ఉందని, తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


కిరణ్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ కమిటీ గ్రేటర్ కో-ఆర్డినేటర్ గండి శ్రావణ్‌కుమార్ తదితరులు

ముషీరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ కో-ఆర్డినేటర్ గండి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమానికి అంకిత భావంతో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలను ఆదుకుంటాం


కొండా సహదేవ్‌ను పరామర్శిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలను ఆదుకుంటామని ఆ పార్టీ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సీనియర్ నాయకుడు, వరల్డ్ గిన్నీస్‌బుక్ రికార్డు గ్రహీత కొండా సహదేవ్‌ను శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు భిక్షపతియాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


గోశాల వద్ద అన్నదానం చేస్తున్న పూసరాజు, పూసస్వామి ట్రస్ట్ సభ్యులు


పేదలకు అన్నదానం

కవాడిగూడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పూసస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోశాల వద్ద నిరుపేదలకు శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు పూసరాజు మాట్లాడుతూ.. పూసస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు సునంద, మణికాంత్, యశశ్రీకాంత్, వందన, దివ్య తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో..

చిక్కడపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదానం చేయడం ఎంతో ఉత్తమమైనదని చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా అన్నారు. సంఘం ఆధ్వర్యంలో వివేక్‌నగర్‌లో ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. సంఘం ప్రధానకార్యదర్శి చేపూరి లక్ష్మణ్, కోశాధికారి చిట్టిమల్ల శ్రీనివాస్, బాలకుమార్, రవీందర్ గుప్తా, నరసింహారావు, ప్రసాదరావు, శంకర్ పాల్గొన్నారు.

వివేక్‌కు మంత్రిపదవి కేటాయించాలి


మాట్లాడుతున్న కాలకోటి సత్యనారాయణ

నల్లకుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో చెన్నూరు ఎమ్మెల్యే జి. వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి కేటాయించాలని వివేక్ సైనిక్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాలకోటి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదర్‌గూడలో ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివేక్ సైనిక్ ఫౌండేషన్ సంస్థ సలహాదారుడు ఎం.ఎ. సిద్ధిఖీతో కలిసి ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు మోహన్‌రావు, సుధాకర్, సంపత్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయని నాయకులపై చర్యలు తీసుకోవాలి'

రాంనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల కోసం పనిచేయని నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తేజగౌడ్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. శుక్రవారం రాంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు అంకిత భావంతో పనిచేయలేదని, గ్యారెంటీలను ప్రజలకు వివరించకపోవడం వల్లే దానం నాగేందర్ ఓడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కొంతమంది నాయకులు అంజన్ కుమార్ యాదవ్ గెలుపునకు కృషి చేయలేదన్నారు. పార్టీ పటిష్ఠత కోసం పనిచేస్తున్న నాయకులకు గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు.

చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న

గోవధ శాలలను మూసివేయాలి



మాట్లాడుతున్న శాలివాహన పండరీనాథ్

కవాడిగూడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న గోవధ శాలలను తక్షణమే మూసివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గోరక్ష చట్టాలు అమలు చేయాలని, గో హంతకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరాపార్కువద్ద దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి, గోరక్ష విభాగం, విశ్వహిందూ పరిషత్ సంయుక్తాధ్వర్యంలో గో మహాధర్నా నిర్వహించారు. స్వామి కమలానంద భారతి, ఆలిండియా మత్ మందిర్ అధ్యక్షుడు రామరాజు, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శాలివాహన పండరీనాథ్, కన్వీనర్ శివరాం, రాష్ట్ర గో ప్రముఖ్ ఇనంపల్లి వెంకన్న, గో రక్ష సహ ప్రముఖ్ జి. రమేష్, బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాలలో ప్రత్యేక గోశాలలను ఏర్పాటు చేయాలన్నారు. గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలను అందించాలన్నారు. బోరబండ, బబ్బిగూడ, నార్సింగ్ తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పశువుల సంతలను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌తో రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల శివారుల్లో ప్రత్యేకంగా పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాటిని జూలై 2వ తేదీ వరకు కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గోవధ నిషేధంపై హైకోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలన్నారు. ఆవులు, ఎద్దులు, లేగ దూడలను వధిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వ అనుమతి లేని కబేళాలను మూసివేయాలని డిమాండ్ చేశారు. గో మహాధర్నాలో ఆర్. శశిధర్, ఆకుతోట రామారావు, సుభాష్, డాక్టర్ శ్రీనివాస్, పలువురుస్వామిజీలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలుదారులతో చేపల మార్కెట్ కిటకిట

● కిలో కొర్రమీను రూ. 500 నుంచి 550కి విక్రయం


కొనుగోలుదారులతో రద్దీగా ముషీరాబాద్ చేపల మార్కెట్

ముషీరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా ముషీరాబాద్ చేపల మార్కెట్ కిటకిటలాడింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే అమ్మకాలు కొనసాగాయి. సాధారణ రోజుల కంటే అధికంగా చేపలు దిగుమతి అయ్యాయి. బొచ్చె, రవ్వ చేపల ధరలను ప్రతిరోజు కన్నా రూ. 10 నుంచి 20 రూపాయలకు అధికంగా విక్రయించారు. కిలో చేపలు రూ. 120 నుంచి 130 పలికాయి. సాధారణ రోజుల్లో కిలో రూ. 400 నుంచి 450 రూపాయలు ఉండే కొర్రమీను మృగశిర కార్తె సందర్భంగా రూ. 500 నుంచి 550 రూపాయలకు విక్రయించారు. చేపలను శుభ్రం చేసి ముక్కలు చేసే వారికి సైతం మార్కెట్‌లో డిమాండ్ విపరీతంగా పెరిగింది. శనివారం చేప ప్రసాదం పంపిణీ చేస్తుండడంతో ప్రజలు పెద్దఎత్తున చేపలు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. శుక్రవారం అమ్మకాలు కొంత తగ్గాయన్నారు.

కులగణన ప్రక్రియ చేపట్టాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

రాంనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ముగిసినందున కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 43 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. కులగణన చేయకపోవడంవల్ల గత ఎన్నికల్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను అమలు చేయాలని, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ, ఇంటర్ చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజులను ప్రభుత్వం చెల్లించాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు బీసీ గురుకుల పాఠశాలలు, ప్రతి జిల్లాకు రెండు డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని, విదేశీ విద్యకు బడ్జెట్ కేటాయించాలని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ఫీజు బకాయిలు చెల్లించాలని మంత్రిని కోరామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు జి. మల్లేష్ యాదవ్, నీలం వెంకటేష్, రామకృష్ణ, అనంతయ్య, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల డిమాండ్ల సాధనకు

ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు కృషి చేయాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రం సత్యనారాయణ

రాంనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బీసీల డిమాండ్ల సాధనకు ఎన్డీయేలో భాగస్వామ్యమైన జేడీయూ, టీడీపీ, ఆర్‌జేడీ పార్టీలు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రం సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి ఆమోదించడం, బీసీ కులగణన, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, క్రీమీలేయర్ తొలగింపు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు జరిగేలా కృషిచేయాలని కోరారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లను 43 శాతానికి పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బీసీల డిమాండ్ల పరిష్కారం, బీసీ ఉద్యమాన్ని రాష్ట్ర, మండల, గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణపై ఈ నెల 23న సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.


సమావేశంలో బీసీ సంఘం నాయకులు గుజ్జకృష్ణ, సుధాకర్, రాజ్‌పాల్, మధుసూదన్, హేమంత్, అనంతయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం ప్రమాదాలు-జాగ్రత్తలపై అవగాహన

● రేపు ఈవీడీఎం ఆధ్వర్యంలో శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నగరంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. తెరిచిన మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లలో పడడం.. విద్యుత్‌షాక్.. నాలాల్లో ప్రమాదవశాత్తు పడిపోవడం.. చెట్లు.. కొమ్మలు విరిగిపడడంతో కొన్నిసార్లు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో వర్షం పడినప్పుడు జాగ్రత్తగా ఉండడం ఎలా..? ప్రమాదాల బారిన పడకుండా ఎలా కాపాడుకోవాలి..? అత్యవసర పరిస్థితుల్లో ఏం చేయాలి..? అన్న దానిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఈవీడీఎం) ఆధ్వర్యంలో బస్తీవాసులు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 9వ తేదీన ఫతుల్లగూడలోని ట్రైనింగ్ సెంటర్‌లో వర్షాకాలం ప్రమాదాలు-జాగ్రత్తలపై అవగాహన, సమాచారంపై విపత్తుల నిర్వహణ విభాగం శిక్షణ ఇవ్వనుంది. వర్షం పడినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ఎవరికి సమాచారం ఇవ్వాలి..? ఏం చేయాలి..? అన్న దానిపై అవగాహన కల్పించనున్నారు. బస్తీవాసులు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు కె. శ్యాంసుందర్‌రెడ్డి (ఎస్ఎఫ్ఓ)ని 7981775687 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టెన్నిస్ రన్నరప్‌గా సంజన


ట్రోఫీతో సంజన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అమ్మాయి సంజన సిరిమల్ల రన్నరప్‌గా నిలిచింది. శామీర్‌పేట్‌లోని యాష్ టెన్నిస్ అకాడమీలో శుక్రవారం జరిగిన ఫైనల్లో సంజన 3-6, 1-6తో సొనాల్ (మహారాష్ట్ర) చేతిలో ఓడింది.


వేటూరి ప్రభాకరశాస్త్రికి నివాళులర్పిస్తున్న దేవీప్రసాద్, జనార్దనమూర్తి తదితరులు

మహనీయుడు వేటూరి ప్రభాకరశాస్త్రి

చిక్కడపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయుడు వేటూరి ప్రభాకరశాస్త్రి అని ప్రభుత్వ విశ్రాంత అధికారి దేవీప్రసాద్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రఖ్యాత పండితులు వేటూరి ప్రభాకరశాస్త్రి సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవీప్రసాద్ మాట్లాడుతూ.. సంస్కృతాంధ్ర భాషా పండితులు ప్రభాకరశాస్త్రి అని అన్నారు. గాయకుడు త్రినాథరావు మాట్లాడుతూ.. చిన్నవయస్సులోనే అవధాన విద్యలో ప్రావీణ్యం పొందారన్నారు. రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ మాట్లాడుతూ.. బ్రౌన్ తెలుగుభాషకు చేసిన సేవలను ప్రభాకరశాస్త్రి సమాజానికి తెలిపారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. ప్రభాకరశాస్త్రి కవి, పరిశోధకుడు, వ్యాసకర్త, సాహితీ ప్రక్రియల్లో ప్రజ్ఞాశాలి అని అన్నారు.

'ఓసీలను విస్మరించడంవల్లే వైఎస్ఆర్‌సీపీ ఓటమి'

బర్కత్‌పుర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఓసీలను విస్మరించడం వల్లనే ఏపీలో వైఎస్ఆర్‌సీపీ ఓడిపోయిందని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి అన్నారు. జగన్ సామాజిక న్యాయం పేరుతో ఓసీలను అణచివేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల నినాదం చేసిన జగన్‌కు కాపులు వ్యతిరేకంగా పనిచేశారని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యం పవన్‌కల్యాణ్‌ను దూషించడం కూడా పార్టీ పతనానికి కారణమన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని వేధింపులు

● డబ్బులు తీసుకుని మోసం చేశాడని పోలీసులకు ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుని ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని డబ్బులు తీసుకుని వేరే మహిళలతో ఫోన్ చేయించి వేధిస్తున్నాడని ఓ మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కదులూరి కనకమహాలక్ష్మి, బిల్లాకుర్తి అప్పారెడ్డి ప్రేమించుకున్నారు. గతేడాది ఆగస్టులో వివాహం చేసుకుని మధురానగర్‌లో నివసిస్తున్నారు. వివాహం అయిన నెల తర్వాత తనకు ఆర్థిక ఇబ్బందులు వచ్చాయని, రూ. 30 లక్షలు కావాలని అప్పారెడ్డి కనకమహాలక్ష్మిని అడిగాడు. ఆమె స్నేహితులు, బంధువుల వద్ద అప్పు తీసుకుని, బంగారం తాకట్టు పెట్టి, క్రెడిట్ కార్డు ఉపయోగించి రూ. 15 లక్షలు ఇచ్చింది.

డబ్బులు తీసుకున్నాక ఆర్థిక ఇబ్బందులు పోవాలంటే చైనాకు వెళ్తానని చెప్పి 29-3-2024న వెళ్లాడు. అతడు వెళ్లిన రెండు రోజులకు మృదల బండారు అనే మహిళ ఫోన్ చేసి అప్పారెడ్డి తన భర్త అని, ఐదు సంవత్సరాల బాబు ఉన్నాడని చెప్పింది. వెంటనే అప్పారెడ్డికి ఫోన్ చేసి అడగగా.. అది అబద్ధం అని, ఆమె నంబర్ బ్లాక్ చేయమని చెప్పాడు. నెల రోజులకు శ్రీకర్ సీత అనే మహిళ ఫోన్ చేసి అప్పారెడ్డి మోసగాడని, అతడిని వదిలేయాలని బెదిరించింది. దీంతో ఈ మహిళలు అప్పారెడ్డితో ఉండి తనను మోసం చేస్తున్నారని, న్యాయం చేయాలని కనకమహాలక్ష్మి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్‌పై తాచు పాము.. ట్రాఫిక్ జామ్


లిబర్టీ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ కేబుల్‌పై తాచు పాము

రాంనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): లిబర్టీ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కేబుల్‌పై తాచుపాము కలకలం సృష్టించింది. వాహనదారులు భయాందోళనకు గురై వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేయడంతో ట్రాఫిక్ జామ్ అయింది. స్థానికులు, వాహనదారులు పామును సెల్‌ఫోన్లలో వీడియో తీశారు. కొద్ది సేపటి తర్వాత కిందకు వచ్చి వెళ్లిపోయింది. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సతీష్‌బాబు


సతీష్‌బాబుకు నియామక పత్రం అందజేస్తున్న అంబటి కృష్ణమూర్తి

బర్కత్‌పుర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డేగల సతీష్‌బాబు నియమితులయ్యారు. శుక్రవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అంబటి కృష్ణమూర్తి ఆయనకు నియామక పత్రం అందజేశారు. సతీష్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐఎన్‌టీయూసీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బి. నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్, నాయకులు జేమ్స్, గురుప్రసాదరావు, కృష్ణారెడ్డి, వికాస్‌సింగ్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు గల సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో శిక్షణ పొందడానికి ఈ నెల 19వ తేదీలోపు ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్ అండ్ ఎథికల్ హ్యాకింగ్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. వివరాలకు 7893141797 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

తీన్మార్ మల్లన్నకు అభినందనలు


తీన్మార్ మల్లన్నను అభినందిస్తున్న మహేందర్, దశరథం

చిక్కడపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన తీన్మార్ మల్లన్నను పలువురు శుక్రవారం రాత్రి కలిసి అభినందించారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్, తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు దశరథం తదితరులు మల్లన్నను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

అంబర్‌పేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో తప్పానని మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..పటేల్‌నగర్‌కు చెందిన ప్రకాష్‌బాబు కుమారుడు సాయిచంద్ర(18) స్థానికంగా ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల ఇంటర్ ఫలితాలు రాగా.. అన్ని సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యాడు. మనస్తాపం చెందిన సాయిచంద్ర గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అంబర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యం


సబావత్ రూక్‌లాల్

బర్కత్‌పుర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. కాచిగూడ నెహ్రూనగర్‌లో నివసిస్తున్న సబావత్ రూక్‌లాల్(60) గురువారం రాత్రి వాకింగ్ చేయడానికి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య శాంతమ్మ శుక్రవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.